క్లుప్తంగా

నేడు 'జగనన్న సురక్ష' సభలు

రాయవరం: మండలంలోని చెల్లూరు–1, రాయవరం–2 సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష సభలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.నరేంద్ర రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే సమావేశాల్లో సచివాలయ పరిధిలోని అన్ని కుటుంబాల్లో అవసరమైన వారికి అన్ని రకాల పౌర సేవలు అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు టేకిలో గడప గడపకూ..

కపిలేశ్వరపురం: టేకిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఆదేశించారు.

స్వామిత్వ సర్వేతో మేలు



కేదారిలంకలో సర్వేపై చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శి

కపిలేశ్వరపురం: ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ సర్వేతో భూ హక్కులు పారదర్శకంగా ఉంటాయని కేదారిలంక సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు అన్నారు. కేదారిలంక గ్రామంలో భూముల కొలతలు తీసుకునే పనులు పూర్తయ్యాయని, ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న జగనన్న సురక్ష గ్రామ సభను నిర్వహించనున్నట్లు సర్పంచ్, ఎంపీటీసీ తెలిపారు.

చలో విజయవాడ విజయవంతానికి పిలుపు

రామచంద్రపురం రూరల్: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన నిరసనను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ద్రాక్షారామ డీసీసీబీ బ్యాంకు ఆవరణలో ఉద్యోగులు సమావేశమయ్యారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం సహకార ఉద్యోగాల ప్రయోజనాల నిమిత్తం జీఓ నంబరు 36 విడుదల చేసినప్పటికీ ఆప్కాబ్, డీసీసీబీ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమలుకు నోచుకోవడం లేదన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించండి

మండపేట: ఏడిద శివారులో సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బుధవారం ఆ గ్రామంలోని పంట పొలాలను ఆయన పరిశీలించారు.

కూళ్లలో పశువిజ్ఞాన బడి



కూళ్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బిందు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పామర్రు పశు వైద్యాధికారి ఎం.బిందు మాట్లాడుతూ పశుగ్రాసాల సాగు, వాటిలో రకాల గురించి అవగాహన కల్పించారు. ఈ నెల 7 నుంచి 14 వరకూ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా ముందస్తు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: లక్కవరం గ్రామానికి చెందిన నేతల శాంతి కుమార్తె ఐదేళ్ల మహిమగ్రేస్ కంటి సమస్యతో బాధపడుతుంది. విషయాన్ని తెలుసుకున్న నవోదయ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ యూనియన్ అధ్యక్షుడు రాపాక చిన్ని స్నేహితుడు పిండి రాజు(దుబాయ్) సమకూర్చిన రూ.5 వేలు, ఎలక్ట్రికల్ల కాంట్రాక్టర్ పెచ్చెట్టి ఏలేశ్వరరావు, విజయ ఎలక్ట్రికల్, కుమార్ చికెన్ షాపుల వారు రూ.10 వేలను బుధవారం మహిమ గ్రేస్‌కు అందించారు. ఈ మొత్తాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు చేతుల మీదుగా చిన్నారి కుటుంబ సభ్యులకు అందించారు. కొల్లాబత్తుల అశోక్, రాపాక చిన్ని, నక్కా రామారావు, నల్లి మోహన్ కుమార్, మోకా రెడ్డి, రేకపల్లి కోటి (బంగారం) పాల్గొన్నారు

సదా మీ సేవలో..

- పథకాల అమలులో వలంటీర్లు కీలకం
- ప్రతి ఇంటికీ చేరిన సంక్షేమం

కాజులూరు: ఒకటో తేదీనే ఇంటికెళ్లి పింఛను ఇచ్చి అవ్వాతాతల ముఖాల్లో ఆనందం నింపేది వలంటీర్లే.. సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించేదీ వారే.. కరోనా కష్ట సమయంలోనూ మేమున్నామంటూ భరోసా ఇచ్చి సేవలతో మురిపించిందీ ఆ సేవా సారథులే.. గూడు లేని పేదలను గుర్తించి ప్రభుత్వ స్థలాలు అందించేందుకు సహకరించిన సంక్షేమ వారధులు వీరే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది. ఆచరణ యోగ్యంగా మారింది. సామాన్యులకు సేవకుల్లా.. అర్హులకు ప్రభుత్వ పథకాలు దరిచేరేలా వారు అందిస్తున్న సహకారం ఎనలేనిది. అలాంటి వలంటీర్లు అందిస్తున్న సేవలు తెలుసుకుందాం రండి.

రుణపడి ఉంటాం..



పింఛను సొమ్ము కోసం గతంలో పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. వృద్ధాప్యం వల్ల అంతదూరం వెళ్లి రావాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే తెలవారకుండా వలంటీరు ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ఇస్తున్నారు. వారి సేవలకు రుణపడి ఉంటాం.

– తేతలి లచ్చారెడ్డి, మొగలిపాలెం

రాజకీయ దురుద్దేశంతో..



వలంటీర్ వ్యవస్థ ద్వారా నిరక్షరాస్యులు, వృద్ధులు, వికలాంగులకు మేలు జరుగుతుంది. రేషన్ వ్యాన్ వద్దకు కూడా వెళ్లలేని మాలాంటి వారికి వలంటీరే బియ్యం తెచ్చి ఇస్తున్నారు. వైద్య, ఆరోగ్యపరంగా ఏ ఇబ్బంది వచ్చినా సహకరిస్తున్నారు. సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లను రాజకీయ దురుద్దేశంతో విమర్శించడం సరికాదు. వలంటీర్ వ్యవస్థ పేదలకు ఒక వరం లాంటిది.

– కర్రి ఆదిలక్ష్మి, బందనపూడి, కాజులూరు మండలం

ఆసుపత్రికి వచ్చి.. పింఛను ఇచ్చి

ఈమె పేరు కర్రి పెంకే సత్యకుమారి. కాజులూరు మండలం పల్లిపాలెం సొంతూరు. ఇటీవల జరిగిన ప్రమాదంలో సత్యకుమారి కాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చేరింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీరు గుత్తుల భాగ్యలక్ష్మి రాజమహేంద్రవరం వెళ్లి ఆమెకు పింఛను సొమ్ము అందజేసింది. ఆ సమయంలో ఆర్థికపరంగా ఇబ్బంది పడుతున్న ఆమెకు ఆ సొమ్ము ఎంతో ఆసరాగా నిలిచింది. సేవాభావంతో దారి ఖర్చులు పెట్టుకుని ఆసుపత్రికి వచ్చి తనకు పెన్షన్ సొమ్ము అందజేసిన వలంటీర్ భాగ్యలక్ష్మికి సత్యకుమారి కృతజ్ఞతలు తెలిపారు.



పెంకే సత్యకుమారికి పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్ భాగ్యలక్ష్మి

సేవలు అమూల్యం



కరోనా కష్ట సమయంలో వలంటీర్ల సేవలు అభినందనీయం. కరోనా వైరస్‌కు భయపడి బంధువులు, స్నేహితులు ఎవరి ఇళ్లకూ రాని పరిస్థితుల్లో వలంటీర్లు మేమున్నామంటూ వచ్చి ప్రతి కుటుంబాన్ని పలకరించేవారు. ఆరోగ్యం గురించి అడిగి మరీ మందులు, నిత్యావసరాలు అందించేవారు. ఆ సమయంలో వారి సేవలు ఎంతో అమూల్యం.

– నున్న లక్ష్మణరావు, శలపాక కాజులూరు మండలం

కార్యాలయాలకు తిరిగే పని తప్పింది



గతంలో ఏ చిన్న పనికైనా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ వలంటీర్ వ్యవస్థ ప్రతిష్టాత్మకంగా పనిచేస్తోంది. వలంటీర్లే ఇంటికి వచ్చి పథకాల గురించి వివరిస్తున్నారు. సచివాలయానికి వెళ్లి మా తరపున దరఖాస్తు చేస్తున్నారు. ఈ వ్యవస్థ వల్ల కార్యాలయాలకు తిరిగే పని తప్పింది.

– ఎం.వెంకటలక్ష్మి, తణుకువాడ

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక 12, 13 వార్డులకు సంబంధించి స్థానిక సీతారామ కల్యాణ మండపంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు పూర్తి స్థాయిలో అర్హులకు అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కనివినీ ఎరుగని విధంగా పేదల అభ్యున్నతికి సీఎం జగన్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, కౌన్సిలర్ మలసాని సీతా మహాలక్ష్మితో కలసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, సొసైటీ ప్రెసిడెంట్ కుక్కల రామారావు, జంగమ, షేక్ కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాసరావు, ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఓగిరాల దేవి పాల్గొన్నారు.

అర్తమూరులో..

జగనన్న సురక్షలో భాగంగా అర్తమూరులో ఇంటింటా సర్వేను సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు ప్రారంభించారు. అక్కడి శివాలయం వీధిలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈఓ అనిల్ కుమార్, నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, తేతలి భూపతిరెడ్డి, నల్లమిల్లి రాంబాబు, జి.శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి బులివీర్రెడ్డి పాల్గొన్నారు.



మండపేటలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు, చైర్‌పర్సన్ దుర్గారాణి



అర్తమూరులో సర్వే చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి తదితరులు

కాజులూరు: గొల్లపాలెం గ్రామ సచివాలయం –2లో తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీఓ ఐ.రత్నరాజు మాట్లాడారు. మిగిలిన లబ్ధిదారులందరికీ న్యాయం చెయ్యాలన్నదే కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, ఎంపీటీసీ జొన్నకూటి సత్యపద్మజ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పడమర ఖండ్రిక సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు

పేదల అభ్యున్నతికి కృషి

కపిలేశ్వరపురం: పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి అన్నారు. పడమర ఖండ్రిక సచివాలయ పరిధిలో సర్పంచ్ నాగమణి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు వివరించారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కవల శ్రీను, తిరునాతి వెంకటేశ్వరరావు, వంగా శ్రీనివాస్, తమ్మన నాగబాబు, నేల సూర్యకుమార్, కవల రాజు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు

రామచంద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. స్థానిక బ్రాడిపేట–2 సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో 1,325 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు వాద్రేవు సాయిప్రసాద్, కేతా శ్రీను, బొక్కా సత్యనారాయణ, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నాయకులు పోతంశెట్టి గోపాలకృష్ణ, కొండేపూడి సురేష్ పాల్గొన్నారు.



రామచంద్రపురంలో సర్టిఫికెట్లు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి

బిక్కిన కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

మండపేట: బిక్కిన కల్పన మృతితో తీవ్ర విషాదంలో ఉన్న ఆమె భర్త వెంకట్రావు, కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబులను బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన వదిన (సోదరుని భార్య) రెండు రోజుల కిందట మృతి చెందిన విషయం విదితమే. స్థానిక నాళంవారి వీధిలోని వారి నివాసానికి వెళ్లి కల్పన చిత్రపటానికి ఎమ్మెల్సీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన, రాజుబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత చోడే శ్రీకృష్ణ, బిక్కిన చక్రవర్తి, డాక్టర్ బీటీ చౌదరిలతో మాట్లాడి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. జంగమ, షేక్ కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాసరావు, ఆలీఖాన్‌బాబా, పార్టీ నాయకులు గారపాటి అశోక్, ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. బిక్కిన కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, న్యాయవాది టీవీ గోవిందరావు, కౌన్సిలర్లు తదితరులు పరామర్శించారు.



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు తగవు



కేదారిలంకలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

కపిలేశ్వరపురం: తమను కించపరుస్తూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారంటూ వలంటీర్లు మండిపడ్డారు. బుధవారం కేదారిలంకలో వలంటీర్లు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ పవన్‌కళ్యాణ్ మాట్లాడడం సరికాదన్నారు. క్షేత్ర స్థాయిలో తాము అందిస్తున్న సేవలు ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రజల సమస్యలపై అవగాహన లేని పవన్‌కళ్యాణ్ దిగజారుడుతనంగా మాట్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు కాశి రమేష్, మద్దింశెట్టి ధనరాజు, వెన్నేటి శివ విజయ్‌కుమార్, యామన నాగవేణి, తిరుపతి భాగ్య పావని, కొండవీటి భరతుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనపర్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం కుతుకులూరు 9, 10వ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీనికి అనుగుణంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మిగిలిన లబ్ధిదారులకూ న్యాయం చేసేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. ఇది ప్రజలకు వరంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ బుల్లిరెడ్డి పాల్గొన్నారు.

మృతదేహం ఖననానికి అభ్యంతరం

కాజులూరు: గొల్లపాలెంలో జనావాసాల మధ్య మసీదు ఆవరణలో మృతదేహాన్ని ఖననం చేసేందుకు ముస్లింలు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వివాదం తలెత్తడంతో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలం వద్ద పహారా కాస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని స్టేట్‌బ్యాంక్ పక్కన పంచాయతీకి చెందిన 46 సెంట్ల స్థలం ముస్లింలకు కేటాయించినట్లు రెవెన్యూ రికార్డులలో ఉంది. గ్రామంలో ముస్లింలు ఎవరూ లేక సుమారు 50 ఏళ్లుగా ఆ స్థలం ఖాళీగానే ఉంది. ఇటీవల మండపేట నుంచి వ్యాపార నిమిత్తం గ్రామానికి వచ్చిన ఓ ముస్లిం ఆ స్థలంలో చిన్న మసీదు ఏర్పాటు చేసుకుని ఉదయం, సాయంత్రం నమాజు చేస్తున్నారు. గత ఏడాది కరోనా వైరస్ విజృంభన సమయంలో పక్క గ్రామమైన ఆర్యావటంలో ఒక ముస్లిం మతస్తుడు మరణించగా అతని మృతదేహాన్ని గొల్లపాలెం మసీదు ఆవరణలో ఖననం చేశారు. జనావాసాల మధ్య మృతదేహాన్ని ఖననం చేయడమేమిటంటూ స్థానికులు ఆందోళనకు దిగి అధికారులకు ఫిర్యాదులు చేశారు. అప్పట్లో మరోమారు సంఘటన పునరావృతం కాదని పెద్దలు సర్ది చెప్పడంతో ఆందోళనలు సద్దుమణిగాయి. బుధవారం ఆర్యావటానికి చెందిన మరో ముస్లిం మరణించారు. అతని మృతదేహాన్ని గొల్లపాలెం మసీదు ఆవరణలో ఖననం చేసేందుకు ముస్లింలు ప్రయత్నించగా వివాదం రేగింది. ఖాళీగా ఉన్న స్థలంలో ముస్లిం సోదరుడు మసీదు ఏర్పాటు చేసుకుని ప్రార్థనలు చేసుకుంటామంటే అంగీకరించామని, తీరా ఇప్పుడు తమ సంప్రదాయమంటూ జనావాసాల మధ్య మృతదేహాలను ఖననం చేస్తున్నారని స్థానికులు రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లపాలెంలో ముస్లింలు ఎవరూ లేరని, పక్క గ్రామమైన ఆర్యావటం నుంచి తీసుకువచ్చి మృతదేహాన్ని ఖననం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు సంఘటన స్థలం వద్ద అధికారులు పహారా కాస్తున్నారు.



గొల్లపాలెం మసీదు వద్ద కాపలా కాస్తున్న రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు సిబ్బంది

కౌలు రైతులకు పంట రుణాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సత్యనారాయణ

అల్లవరం: కౌలు రైతులకు సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో పంట రుణాలను ఇవ్వడానికి బోడసకుర్రు గ్రామాన్ని రెండో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. బోడసకుర్రు–1 సచివాలయంలో కౌలు రైతులకు పంట రుణాలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామంలో నివాసముంటూ 65 ఏళ్ల లోపు వయసున్న కౌతు రైతులు రుణం పొందే అవకాశం ఉందన్నారు. వీఆర్‌ఓ, వ్యవసాయ సహాయకుల ద్వారా ఎంపిక చేసిన కౌలు రైతులకు అల్లవరం సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. వరి నాట్లు పూర్తయిన తరువాత మొదటి విడతగా 25 శాతం, 50 రోజుల తరువాత మిగిలిన మొత్తాన్ని మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, వీఆర్‌ఓ జి.సత్యనారాయణ, ఉల్లీస్, ప్రసాద్, రొక్కాల నాగేశ్వరరావు, చింతం శ్రీను, రైతులు దొమ్మేటి రాధాకృష్ణ, బావన్న, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచుల వాడకం ప్రమాదకరం

యానాం: ప్లాస్టిక్ వస్తువుల కన్నా ప్లాస్టిక్ సంచుల వాడకం ప్రమాదకరమని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ బీచ్ పరిసర ప్రాంతాల్లో క్లీన్ యానాం–గ్రీన్ యానాం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 వలంటీర్లు బీచ్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ వందలాది మంది పర్యాటకులు వచ్చే రాజీవ్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘు నాయగం, ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు రానివ్వం



పారిశుధ్యం గురించి స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వార్డు పర్యటనలు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. బుధవారం స్థానిక గొల్లపుంతలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, 16వ వార్డు కౌన్సిలర్ మెండు బాపిరాజుతో కలసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య నిర్వహణపై స్థానికులతో మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య సమస్యలు రాకుండా సహరించాలని, చెత్తను డ్రైన్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. స్థానికులు చెప్పిన సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, గవర దుర్గాప్రసాద్, పెంకే గంగాధర్, మెండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద గ్రామానికి చెందిన కొప్పిశెట్టి గోవిందు కనిపించడం లేదని అతని సోదరుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై ఎస్ఎస్ భుజంగరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గోవిందు దివ్యాంగుడు. లారీపై క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 29న ఉండూరు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సత్యనారాయణ హసనబాద వచ్చి గోవిందును తనతో తీసుకు వెళ్లాడు. నాలుగు రోజుల తరువాత సత్యనారాయణకు గోవిందు భార్య ఫోన్ చేసి తన భర్త ఆచూకీ అడిగింది. అయితే గోవిందు తాను తీసుకు వెళ్లిన కాసేపటికే వెళ్లిపోయినట్లు అతను తెలిపారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాఠశాలల్లో డీఈఓ అన్నపూర్ణ తనిఖీ



తాళ్లరేవు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అన్నపూర్ణ

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి, పటవల, తాళ్లరేవు, నీలపల్లి హైస్కూల్స్‌తో పాటు చొల్లంగిపేటలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను డీఈఓ కేఎంపీఎస్ అన్నపూర్ణ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా కానుకల పంపిణీని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిఫాం, షూస్, బ్యాగులు, బెల్టులను విద్యార్థులు ప్రతిరోజూ వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఇంటరేక్టివ్ ప్యానెల్‌ను వెంటనే సిద్ధం చేసి ఉపయోగించేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ తదితరులున్నారు.

గురుకులాల్లో పరిశీలన

అల్లవరం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలికల గురుకులాల్లో మండల ప్రత్యేక అధికారి కన్నీడి మూర్తి బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బాలుర గురుకులంలో 20 మరుగుదొడ్లు, బాలికల హాస్టల్లో 10 మరుగుదొడ్లకు తలుపులు అవసరమని గుర్తించారు. బాలుర గురుకులంలో వాటర్ ట్యాంక్ వద్ద శుభ్రం చేయించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారుచేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల్లో సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని ప్రత్యేకాధికారి మూర్తి విలేకరులకు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబ శివప్రసాద్, తోట నరసింహరావు, ప్రిన్సిపాల్ శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్లమో విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల డిప్లమో తృతీయ సంవత్సరం విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో విజయ, విశాఖ పాల ఉత్పత్తి కేంద్రాలను సందర్శించారు. పాల ఉత్పత్తి కేంద్రాల్లో పాల సేకరణ, ఉత్పత్తి, నిల్వ ఉంచు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యక్ష పరిశీలనతో నూతన ఆవిష్కరణలకు పునాది పడుతుందన్నారు. కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ, రమేష్‌రాజు పాల్గొన్నారు.

చమురు సంస్థలకు పటిష్ట భద్రత

తాళ్లరేవు: రాష్ట్రంలోని కేజీ బేసిన్ పరిధిలోని ప్రతిష్టాత్మక సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ సంస్థలకు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సాయుధ సిబ్బందితో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు జోన్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు తెలిపారు. ఇటీవలే ఏపీఎస్‌పీఎఫ్ రాజమండ్రి జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ ప్లాంట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధికారులు కమాండెంట్ నరసింహారావును మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బసవా శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.